: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు


సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 40 | 11-07-2022 | పుటలు : 4

## నానోక్రిస్టల్ మిశ్రమాలపై అవగాహన

### IISc రీసర్చ్ సెంటర్ మాజీ చైర్మన్ ఆచార్య కె.బి.ఆర్.వర్మ



ఆచార్య వర్మను సన్మానిస్తున్న విశ్వవిద్యాలయ అధికారులు


**07.07.22 (మీడియాసెల్)**
మల్టీ ఫంక్షనల్ గ్లాస్ నానోక్రిస్టల్ కాంపోజిట్స్ తో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ రీసెర్చ్ మెటీరియల్ రీసెర్చ్ సెంటర్ మాజీ చైర్మన్, శ్రీ సత్య సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైయర్ లెర్నింగ్ పుట్టపర్తి పూర్వ ఉపకులపతి ఆచార్య కె.బి.ఆర్. వర్మ అన్నారు. గురువారం ఆదికవి నన్నయ యూనివర్సిటీని కెబిఆర్ వర్మ సందర్శించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ మరియు సైన్స్ అండ్ టెక్నాలజీ అధ్యాపకులు, పరిశోధకులు మరియు విద్యార్థులతో పలు ఆసక్తికరమైన అంశాలను వర్మ పంచుకున్నారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్, పూర్వ ఉపకులపతి వర్మ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి చేస్తున్న ఆచార్య మొక్కా జగన్నాథరావు సేవలను ప్రశంసించారు. నన్నయ విశ్వవిద్యాలయం ఉమ్మడి గోదావరి జిల్లాలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నానోక్రిస్టల్ మిశ్రమాలపై అవగాహన కల్పించారు. నానోక్రిస్టల్ మిశ్రమాలతో చాలా ప్రయోజనాలు ఉన్నాయని సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థులు వీటిపై పట్టు సాధించాలని అన్నారు. మెటీరియల్ కాంపోజిట్స్ తో ఆయా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా భవన నిర్మాణాలు చేపట్టవచ్చునని తెలిపారు. దీనికోసం సివిల్ ఇంజనీరింగ్ ఫిజిక్స్ కెమిస్ట్రీ వంటి విభాగాలు కలిసి పని చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే మల్టీ ఫంక్షనల్ ఫిష్ స్కేల్ గురించి వివరించారు. నానో లీనియర్ ఆప్టికల్ మెటీరియల్ ప్రాముఖ్యాన్ని వివరించారు. శాస్త్ర సాంకేతిక రంగాలు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయని దానికి తగినట్లుగా విద్యార్థులు తమ విజ్ఞానాన్ని అభివృద్ధి పరచుకోవాలని తెలియజేశారు. తరువాత విశ్వవిద్యాలయ అధికారులు ఆచార్య వర్మ ను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, ఓ.ఎస్.డి ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్ ఆచార్య కె.రమణేశ్వరి, డా.బి.జగన్మోహన్ రెడ్డి, డా.ఎ.మట్టారెడ్డి, డా.రాజ్యలక్ష్మి,డా.రామకృష్ణ, డా.మురళీకృష్ణ, డా.పద్మారావు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## విప్లవజ్యోతి మన అల్లూరి

### నన్నయలో అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకలను

**04.07.22 (మీడియాసెల్)**
మన్యం ప్రజల్లో స్వాతంత్ర్య చైతన్యాన్ని నింపి విప్లవ దీక్షను రేకెత్తించిన విప్లవ జ్యోతి మన అల్లూరి సీతారామరాజు అని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు నివాళులర్పించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సోమవారం అల్లూరి సీతారామరాజు 125 వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మన్య ప్రజల్లో స్వాతంత్ర్య చైతన్యాన్ని నింపి విప్లవ దీక్షను రగిలించిన విప్లవ జ్యోతి అల్లూరి అని కొనియాడారు. చిన్న వయసులో దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పోరాటం చేసారన్నారు. తన ధైర్యసాహసాలతో ఆంగ్లేయుల గుండెల్లో గుబులు పుట్టించిన మన తెలుగు వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. అడవి బిడ్డల హక్కుల కోసం పోరాటం చేస్తూ, గిరి పుత్రులకు అండగా నిలిచి మన్యం దొరగా



అల్లూరు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న వీసీ

కీర్తిగాంచారన్నారు. పట్టుదలతో పోరాటం చేసిన అల్లూరిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు విద్యలో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డి ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.రమణీశ్వరి, డా.వి.పెర్సిస్ , డీన్ ఆచార్య డి. జ్యోతిర్మయి, డా.ఎ.మట్టారెడ్డి, డా.పి.విజయనిర్మల, డా.కె.వి.స్వామి , డా.ఎం.గోపాలకృష్ణ , ఎఫ్.ఓ. శ్రీసత్యనారాయణ పాల్గొన్నారు.

## సంపాదకీయం




# విప్లవాగ్ని

పారతంత్ర్యాపతితమైన భారతజాతిని ఉద్ధరించడానికి నడుంకట్టిన మహనీయులలో తొలి విప్లవ కిరణం, బ్రిటిష్ ప్రభుత్వాన్ని ధిక్కరించి దేశ ప్రజల బాగుకోసం దేశ సేవా దృక్పథంతో తీవ్ర ధ్వనితో విప్లవ శంఖం వినిపించిన ఆత్మ త్యాగైక శీలి అల్లూరి శ్రీరామరాజు.

తెల్లదొరల దమన నీతిని వ్యతిరేకించి మన్యసీమలో తూర్పు కొండమీద కనిపించిన ఆకుపచ్చని సూర్యోదయం ఆయన.

'నీ నివాస ప్రాంతాన్ని ప్రేమించు అదే నీ దేశభక్తికి దారి' అంటారు కొరియానేత. శ్రీరామరాజు చేసినదదే. నిబద్ధతగల విప్లవకారులకి చావు, బ్రతుకు రెండు వేరు కాదు.ఒకటే! నదీ, సాగరము అనేవి రెండూ వేరు అంశాలు కావు. రెండు ఒక్కటే! అంటారు ఖలీల్ జిబ్రాన్.

భారత దేశ చరిత్ర పుటల్లో అల్లూరి శ్రీరామరాజు " ది గ్లోరియస్ రివల్యూషన్". గిరిజనాభ్యుదయ విప్లవకారుడై కొండలలో ఆవరించుకొని ఉన్న చిమ్మ చీకటిలో చిరుకాంతి. మన్య ప్రజలపట్ల శ్రీరామరాజుకి కలిగిన దయామయ భావన. అతనికి గల సేవా సంభావన.ఇదే ఆయన విప్లవానికి ప్రచోదన. ఆయన జీవనశైలి యోగం! విప్లవం ఆయనకు దైవ నియోగం!!

విప్లవం అంటే మార్పు. విప్లవం అంటే క్రాంతి. శ్రీరామరాజు లేదా సీతారామరాజు ఒక విప్లవం! ఒక నమ్మకం! ఒక చరిత్ర! అటువంటి వీరుడికి మరణం లేదు. విప్లవానికి అంతం లేదు. ఈ ప్రపంచంలో కొందరే కారణజన్ములవుతారు. అటువంటి వారిలో శ్రీరామరాజు ఒకరు.

గోదావరి జిల్లాలలో ముప్పది అడుగుల ఎత్తైన ఆయన స్మృతి చిహ్నం నిరంతరం విప్లవ చైతన్యాగ్నికిప్రతీక.

పునాదిరాళ్లు ఎప్పుడూ భవనాన్ని చూడలేవు.కానీ ఆ భవనం ఆ పునాదిరాళ్ల మీదే నిలబడి ఉందనేది సత్యం!

# నన్నయ వీసీని కలిసిన ప్రముఖులు



పోలీస్ హౌస్సింగ్ కార్పోరేషన్ ఎం.డి.సంజయ్ ను సన్మానిస్తున్న వీసీ

**06.07.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావును ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీసు హౌస్సింగ్ కార్పోరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.సంజయ్ మర్యాదపూర్వకంగా కలిసారు. బుధవారం విశ్వవిద్యాలయంలో వీసీని కలిసిన సంజయ్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీసు హౌస్సింగ్ కార్పోరేషన్ లిమిటెడ్ నిర్వహిస్తున్న పనులను వివరించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు. కార్పోరేషన్ తరుపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేసారు. రాష్ట్రంలోని ఆయా రంగాల్లో నిర్మాణ పనులను పోలీసు హౌసింగ్ కార్పోరేషన్ నిర్వహిస్తుందని, దానిలో భాగంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని నిర్మాణ పనులు కార్పోరేషన్ ద్వారా నిర్వహించాలనే ప్రతిపాదనను తెలియజేసారు. దీనిపై సానుకూలంగా స్పందించిన వీసీ జగన్నాథరావు ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీసు హౌస్సింగ్ కార్పోరేషన్ లిమిటెడ్ తో కలిసి పని చేద్దామని అన్నారు. త్వరలో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుందామని చెప్పారు. కార్పోరేషన్ ఎం.డి ఎన్.సంజయ్ ను శాలువాతో సన్మానించి విశ్వవిద్యాలయ జ్ఞాపికను అందజేసారు. తరువాత బిర్లా ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, బయోలాజీకల్ సైన్స్ ఆచార్య కె.నాగమోహన్ వీసీ ని మర్యాదపూర్వకంగా కలిసారు. విశ్వవిద్యాలయంలో ఇటీవల కాలంలో సాధించిన అభివృద్ధిపై వీసీని ప్రశంసించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని బయోటెక్నాలజీ విభాగానికి సంబంధించిన రిసెర్చ్ ప్రోజెక్ట్స్, సెమినార్ నిర్వహణకు కలిసి పని చేయాలని విభాగ అధికారులకు, ఆచార్య కె.నాగమోహన్ కు తెలియజేసారు. అనంతరం చైనా యూనివర్సిటీలో పని చేస్తున్న ప్రవాసాంధ్రులు జి.మోహన్ వీసీని కలిసారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా చక్కని వర్క్ షాప్ నిర్వహించాలని జి.మోహన్ కు వీసీ సూచించారు.

# విద్యాదాత వై.ఎస్.ఆర్ : రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్




వైయస్సార్ కు నివాళులర్పిస్తున్న విశ్వవిద్యాలయ అధికారులు

**08.07.22 (మీడియాసెల్)** తెలుగు రాష్ట్రాల్లోని పేద , మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యనందించేందుకు ఫీజురియింబర్స్మెంట్ మరియు విశ్వవిద్యాలయాలను స్థాపించిన విద్యాదాత దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి అని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అన్నారు . శుక్రవారం యూనివర్సిటీ ఈసీ హాల్ లో వై.ఎస్.ఆర్ 73 వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ హాజరై వై.ఎస్.రాజశేఖర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు . ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ 2006 వ సంవత్సరంలో దివంగతనేత డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి స్థాపించిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ , ప్రస్తుతం వై.ఎస్.ఆర్ తనయుడు సిఎం జగన్మోహనరెడ్డి సహకారంతో వీసీ ఆచార్య జగన్నాథరావు నాయకత్వంలో అభివృద్ధి చెందుతుందన్నారు . విద్యాదాతగా , ఆరోగ్యశ్రీ ప్రదాతగా , మహానేత , మాజి ముఖ్యమంత్రి వైయస్ పదవీకాలంలో పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన దివంగత రాజశేఖరరెడ్డి అందరికీ ఆదర్శమని కొనియాడారు . ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు డా.పి.వెంకటేశ్వరరావు , డా.కె.సుబ్బారావు , ఎస్.లింగారెడ్డి , ఆచార్య డి.జ్యోతిర్మయి , డా.వి.పెర్సిస్ , జి.చంద్రకళ , డా.ఎం.గోపాలకృష్ణ పాల్గొని వై.ఎస్.ఆర్ కు నివాళులర్పించారు.

# గిరిజన వైద్య సర్వస్వం

చరక సంహిత, సుశ్రుత సంహిత వంటి సంహితలు వచ్చి ఉండకపోతే భారతీయులకు ప్రపంచవ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టిన ఆయుర్వేదమనే ఒక వైద్యశాస్త్రం ఉందని తెలిసేది కాదు. గిరిజనుల్లో తరతరాలుగా వేలాది సంవత్సరాలుగా వస్తున్న వైద్య విజ్ఞానాన్ని ఒక సర్వస్వంగా రూపొందించి డాక్టర్ కొప్పుల హేమాద్రిగారు ఇప్పుడు తెలుగు ప్రజలకు తద్వారా ప్రపంచ ప్రజానీకానికి ఈ వైద్య సర్వస్వాన్ని రచించి మహోపకారం చేశారు. వైద్య విజ్ఞానమంతా అనుభవ ప్రాతిపదికన మొదలైనదే. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కలిగిన అనుభవాలు, అనుభూతులు అన్వేషణకు, పరిశోధనకు దారి చూపుతాయి. ప్రకృతి ఒడిలో పుట్టి పెరిగిన మనిషి తన కష్టాలకు నివారణల్ని కూడా ప్రకృతి నుండే తెలుసుకొన్నాడు. ఆ క్రమంలో జ్ఞానం నుంచి మరింత ఉన్నతి కోసం ముందుకు సాగాడు. కొండల్లో, కోనల్లో పుట్టి అక్కడే జీవనం సాగించే గిరిజనుల వికాసం అంతా ఈ విధంగా జరిగిందే.

ఆధునికంగా జరిగే పరిశోధనలు ప్రయోగశాలల్లో జంతువుల మీద జరుగుతాయి. గిరిజనులు మాత్రం తమ మీదే ప్రయోగించుకుని మందు మొక్కలను కనిపెట్టారు. వాళ్ళు కపటం లేని వారు కనుక వారి దృష్టిలో తనతో సహా అందరి కష్టం ఒకటే. అందుకనే వారి పరిశోధనలు స్వార్ధ ప్రాతిపదికన కాక, వ్యాపార ప్రాతిపదికన కాక కొనసాగాయి. గిరిజనుల్లో ఉండిపోయిన విజ్ఞానం అనంతమైనది. ఈ గ్రంథకర్త ఆ అనంత విజ్ఞానంలో నుంచి వీలైనంత తనకు చేతనైనంత తోడుకొని మన భాషలో మనకు అందించడం, దానితోపాటు ఒక వృక్ష శాస్త్రజ్ఞుడుగా ఆయన గిరిజన వైద్య ప్రయోగాల్లో వచ్చే ప్రతి ఔషధానికి వీలున్నంతవరకూ వృక్ష శాస్త్రంలో ఉన్న ఆధునిక నామాన్ని కూడా స్పష్టంగా చెప్పారు.అది అంత తేలికైన పనికాదు.ఒకే మందు మొక్కను రకరకాల పేర్లతో గిరిజనులు తెలపడాన్ని, ఒకే రకం మొక్కలు కొద్దిపాటి తేడాతో ఉండే భేదాన్ని గమనించి వారు వ్యవహరించడాన్ని ఈ వృక్ష శాస్త్రవేత్త గమనించారు. అందువల్ల ఎంతో విచక్షణతో ఆ మొక్కలకు శాస్త్రం నామాన్ని ఇవ్వటంలో స్పష్టత కోసం తన నలభై ఏళ్ళ అనుభవం వినియోగించుకున్నారు. ఈ రకంగా ఈ గ్రంథం ఒక ఆధునిక రూపాన్ని సంతరించుకుంది. పాల నుంచి పెరుగు నుంచి చిలికి వెన్న తీసి మరిగించి కమ్మటి నెయ్యి సాధించినట్లే హేమాద్రి గారు ఎంతో శ్రమ చేసి ఈ విజ్ఞానాన్ని మనకు అందించారు.







వీటిలో ఉన్న అమూల్యమైన ప్రయోగాలపై ఆధునిక పరిశోధనలు చేయదలచుకున్న వారికి ఎంతో నమ్మదగిన రిసోర్స్ సమకూర్చి పెట్టారు. నిజమైన శాస్త్రవేత్తలు, వ్యాపార ప్రయోజనాన్ని ఆశించి ముందుకు సాగే మహానుభావులు కానీ ఈ సంహితలోని జ్ఞానాన్ని ఎంతైనా ఉపయోగించుకోవచ్చు. తేడా అంతా వారు ఆ పనిని స్వార్ధ రహితంగా లోకహితం కోరి చేస్తున్నారా, స్వార్థ ప్రయోజనాల కోసమే చేస్తున్నారా అనేది మాత్రమే. ఏది ఏమైనా ప్రయోజన దాయకమైన సంహిత ఈ సమాజానికి అందించారు.

ఆధునిక వైద్యం కానివ్వండి, హోమియో తదితర వైద్య విధానాలు కానివ్వండి, దేశీయమైన ఆయుర్వేద వైద్యం కానివ్వండి, ఏ వైద్య విధానానికి సంబంధించిన వారైనా వారంతా గిరిజనుల వైద్యాన్ని తక్కువగా చూడటం మానుకోవాలి. తమ తమ వైద్య విధానాలు అన్నిటికీ ఏదో ఒక దశలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో గిరిజన వైద్యం ఆలంబన అవసరాలుగా నిలిచాయి. వాటి ఆధారంగా ఆయా విధానాల్లో పరిశోధనలు కొత్త ఆవిష్కరణలు జరిగిన సందర్భాలు అనేకం. గిరిజన వైద్యంలో అనేక ప్రయోగాలు ఇప్పటికీ పైన చెప్పిన విధంగా ఉన్నాయి. జబ్బును నయం చెయ్యని బ్రహ్మాండమైన పరిశోధనాత్మక జ్ఞానం కంటే వెనువెంటనే సత్ఫలితాలను ఇచ్చే అనుభవ జ్ఞానం ఏ విధంగానూ తీసిపోదు. ఎన్నో వేలాది అనుభవాలు ఈ విధంగా జనజీవన చరిత్రలో నమోదు అయ్యాయి. అందుకనే మనమంతా వివిధ రంగాల్లో నిష్ణాతులమైనా, అమాయకులైన ఆ గిరిపుత్రులకు, గిరిపుత్రికలకు చేతులెత్తి దండం పెట్టాలి. వారిని గౌరవించడం నేర్చుకోవాలి. వారి నుంచి నేర్చుకోవడం నేర్చుకోవాలి. తెలుగు జాతి డాక్టర్ హేమాద్రి గారిని చూసి గర్విస్తోంది. ఆయన గిరిజనులకు ఋణపడ్డారా, గిరిజనులే ఆయనకు ఋణ పడవలసిఉందా... అనేది కాలం తేల్చవలసిన సంగతి. ఈ గ్రంథం తెలుగు, ఆంగ్లంతోపాటు అన్ని భారతీయ భాషలలోనికీ రావాల్సిన అవసరం ఉంది.


- డా.సామల రమేష్ బాబు.



## మంచిమాట

చేయబోయే పనిని తెలుసుకోవటమే వివేకం.దానిని ఎలా చేయాలో తెలుసుకోవటం నైపుణ్యం. దానిని పూర్తిచేయటం సద్గుణం.


- గోర్టన్






రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ చిత్రకారులు "హంపి" వేసిన అల్లూరి సీతారామరాజు మన్యం తిరుగుబాటు చిత్రాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పోస్టల్ కవర్ పై ముద్రించడం విశేషమైన అంశం. ఈ సందర్భంగా నన్నయవాణి వారికి అభినందనలు అందిస్తోంది.

హంపి
ప్రముఖ చిత్రకారులు
రాజమహేంద్రవరం



# నాక్ పీర్ టీమ్ విజిట్‌కు సన్నద్ధం కావాలి

**05.07.22 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపు కోసం చేస్తున్న ప్రయత్నాలు వేగవంతం చేస్తున్నామని, త్వరలో విశ్వవిద్యాలయాన్ని నాక్ పీర్ టీమ్ విజిట్ చేయనున్న నేపథ్యంలో అన్ని విభాగాలు సన్నద్ధం కావాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. మంగళవారం యూనివర్సిటీ నాక్ కమిటీ సభ్యులతో వీసీ సమావేశాన్ని నిర్వహించారు. దీనిలో ఆయన మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాని నాక్ గుర్తింపు ఎంతో అవసరమని ప్రతీ ఒక్కరూ నాక్ సాధన కోసం పని చేయాలని అన్నారు. ఇప్పటికే సెల్ఫ్ స్టడీ రిపోర్ట్(ఎస్.ఎస్.ఆర్)ను పూర్తి స్థాయిలో సమర్పించామని, త్వరలో నాక్ పీర్ టీమ్ యూనివర్సిటీని విజిట్ చేస్తారన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలలోని అన్ని విభాగాలను పీర్ టీమ్ పరిశీలిస్తారని చెప్పారు. కాబట్టి అన్ని విభాగాల అధ్యాపకులు తమతమ విభాగాలు సాధించిన విద్య, క్రీడా, సేవ వంటి అన్ని రంగాల విజయాలు, సదస్సుల వివరాలను ప్రదర్శించేందుకు వీలుగా సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు మరియు విశ్వవిద్యాలయ అభివృద్ధిని, ప్రతిభను ప్రతిబింబించే విధంగా ప్రెజెంటేషన్స్ ఉండాలన్నారు. ల్యాబ్స్, వసతులు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విభాగాల స్థాయిలో కోర్సు కోఆర్డినేటర్లు, కళాశాల స్థాయిలో ప్రిన్సిపాల్స్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్స్ ను సిద్ధం చేయాలన్నారు. ఎస్ఎస్ఆర్ లో సమర్పించిన బోధన ప్రమాణాలు, పరిపాలన, పరిశోధనలు, విద్యార్థుల భాగస్వామ్యం వంటి ఏడు ప్రధాన అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలతో సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఓ.ఎస్.డి ఆచార్య ఎస్.టేకి, ఎగ్జిక్యూటివ్ కోఆర్డినేటర్ డా.కె.వి.స్వామి, ప్రిన్సిపాల్స్ ఆచార్య కొట్టి శ్రీరమేష్, ఆచార్య.కె. రమణీశ్వరి డా.ఎం.కమలకుమారి, డా.వి.పెర్సిస్ మరియు అన్ని విభాగాల కోర్సు కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



# వృద్ధికి ఆటంకం.. అధిక జనాభా




చాలా దేశాలు ఆరోగ్య సదుపాయాలను, ఉద్యోగాలను సకాలంలో అందించకపోవడంతో కొన్ని లక్షల మంది ప్రాణాలు కోల్పోవడం,ఉపాధి కోల్పోవడం జరుగుతుంది.దీనికి కారణం అధిక జనాభా.అందువల్ల జనాభా విస్ఫోటనం వలన సంభవించే పరిణామాలను,అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో సంవత్సరంలో ఒక రోజును జనాభా దినోత్సవంగా జరపాలని అప్పటి ప్రపంచబ్యాంక్ సీనియర్ డెమోగ్రాఫర్ డాక్టర్ కె.సి జకర్య సూచించారు.ఇదే సమయంలో 1987 జూలై 11 న ప్రపంచ జనాభా 500 కోట్లకు చేరుకోవడంతో 1989లో జనాభా దినోత్సవం జరపాలని నిర్ణయించింది.1990లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో 45/126 తీర్మానం చేసి ప్రతి సంవత్సరం జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం గా నిర్ణయించింది. అమెరికా సెన్సెస్ బ్యూరో సర్వే ప్రకారం..2022 జూలై నాటికి ప్రపంచ జనాభా 789 కోట్లు, 2023 నాటికి 800 కోట్లు, 2037 నాటికి 900 కోట్లు, 2057 నాటికి 1000 కోట్లకు చేరి భూమి పట్టలేని, మోయలేని స్థితిలో నెట్టుకొస్తుందని ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇలా జనాభా విస్ఫోటనం వలన అనేక దేశాల్లో అసమానతలు ఏర్పడి పలు సమస్యలు పట్టి పీడిస్తూ ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లేక ప్రజలు ఇతర దేశాలకు వలస వెళుతున్నారు.పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నాణ్యమైన విద్య,వైద్యం అందుబాటులోకి రాక ప్రజలు పేదరికంలోకి పోతున్నారు.

అధిక జనాభా వలన ఆహారం, త్రాగునీరు,విద్య,వైద్యం,పర్యావరణం ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. కాలుష్యం విపరీతంగా పెరిగి అనారోగ్యానికి కారణం అవుతున్నాయి.జాతీయ,తలసరి ఆదాయం పెరిగినా ప్రజలు మాత్రం పేదరికం చవిచూస్తున్నారు.దీంతో చాలా మంది యువత మాదకద్రవ్యాల అక్రమ రవాణా,ఉగ్రవాదం,సైబర్ నేరగాళ్ల గా మారుతున్నారు. అందువలన అధిక జనాభా ని తగ్గించాలంటే ఈ జనాభా దినోత్సవం నాడు ప్రజలను చైతన్య పరచాలి.అధిక జనాభా నియంత్రణ విషయంలో మత విశ్వాసాలను,మూఢనమ్మకాలను పక్కన పెట్టాలి. "భూభాగం తక్కువ – జనాభా ఎక్కువ" వలన కలిగే ప్రమాదాలను ప్రజలకు తెలియజేయాలి.కుటుంబ నియంత్రణ పాటించాలి.లింగ వివక్షతను విడనాడాలి.మానవ హక్కుల రక్షణకు కట్టుబడాలి.చివరిగా అధిక జనాభా విషయంలో ప్రజల ఆలోచనల్లో మార్పు ద్వారానే అనుకొన్న లక్ష్యాన్ని సాధించగలం.ఈ విధంగా ప్రజలను చైతన్య పరిచేందుకు ప్రభుత్వాలు, విద్యావేత్తలు,మీడియా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు విశేషంగా కృషి చేయాలని కోరుకుంటున్నాను.

- బి.సుశాంత్ కుమార్

బీ.ఎడ్. (ద్వితీయ) ANUR

